# ఛీ టర్

"నమస్తే గురూ..."

వ్రాసుకుంటున్నవాడినల్లా తలెత్తి చూశాను.

వచ్చిన వ్యక్తి ఎవరైందీ వెంటనే పోల్చుకోలేక 'మీ...రు...' అర్థోక్తిలో ఆగేను.

"మీరా!? — ఏమిటా గౌరవవాచకం?... అంటే నన్ను పూర్తిగా మర్చిపోయావన్న మాట..."

ప్రశ్నార్థకమైన నా చూపు ఇంకా అతనిమీదే వుంది.

"నీ పేరు రాజారావు. అవునా!? నీ కాలేజీ చదువు విజయవాడలో. బి. కాం. ఫైనలియర్లో నువ్వు బెస్ట్ యాక్టర్ ప్రైజు గెల్చుకున్నావ్ నాటకాల పోటీల్లో. అప్పటికీ నీకింకా

పెళ్ళి కాలేదు. కాలేజి బ్యూటీ పద్మని లవ్వాడేవు..." గడ గడా చెప్పుకుపోతున్నాడు.

అతను చెప్పేవన్నీ నూటికి నూరుపాళ్ళూ నిజం!

"కూర్చోండి... ప్లీజ్...."

"అండీ ఏమిటోయ్ నాన్సెన్సు! — నేనేమైనా నీ ఇంటికి తిండికి గతిలేక వచ్చాననుకున్నావా? అవున్లే!... దీన్ని బట్టి నాకు బోధపడ్డదేమిటీ అంటే... నన్ను నువ్వింకా గుర్తించి పోల్చుకోలేదూ అని..." కుర్చీలో కూర్చుంటు అన్నాడు.

సన్నగా నవ్వి అతను చెప్పింది అక్షరాలా నిజమన్నట్టు తల ఆడించేను.

"అదీ నిజమే! మనిద్దరం ఒకరి నొకరం చూచుకుని ఇరవై య్యేళ్ళు దాటింది — అందుకే నన్ను నేను పరిచయం చేసుకోవటం మంచిది...."

ఏంచెప్పబోతున్నాడాని అతనికేసే ఆత్రంగా చూస్తూ వుండిపోయాను.

"నా పేరు కృష్ణమూర్తి. విజయవాడ సత్యనారాయణ పురంలో మా ఇల్లు! చదువుకునే రోజుల్లో నువ్వు కేదారేశ్వర పేట మీ అన్నగారింట్లో వుండేవాడివి. అవునా!? — ఒక రోజు... మీ వదిన నిన్నేదో అన్నదని ఇంట్లో భోజనం చేయకుండా అలిగి మాఇంటికొచ్చేవు గుర్తుందా?..."

గతం నా కళ్ళముందు మెదలాడ సాగింది.

కొందరికి ఎంతటి చిన్న విషయమైనా జీవితాంతం గుర్తుంటుంది. జ్ఞాపకశక్తి నామటుక్కు నాకు చాల తక్కువ.

ఇంతలో శ్రీమతి రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి అందించింది.

"సారీ కృష్ణమూర్తి!...... వెంటనే గుర్తించలేక పోయాను. డోన్ట్ ఫీల్ ఎనీథింగ్..." కాఫీ చప్పరిస్తూ క్షమాపణ చెప్పుకున్నాను.

"ఏమిటీ... ఏదో వ్రాస్తున్నట్టున్నావ్... కథా! — నవలా? ...... నవలే అయివుండాలి!... అయితే నీ కేరీర్ లాంఛనప్రాయంగానే వుందన్నమాట .."

నేను కథలు వ్రాస్తానని కృష్ణమూర్తి కెలా తెల్సు?— కాలేజీలో చదివే రోజుల్లో రచనా వ్యాసంగం నాలో బొత్తిగా లేదే?...

నా మనసులో భావాన్ని గ్రహించేస్తూ "నాకు అన్నీ తెల్సు బ్రదర్. — నువ్వు రచయితగా ఎదిగిపోవటం చూచి నువ్వు నా ఫ్రెండువనీ... గొప్పగా వెలిగి పోతున్నావనీ... స్నేహితులతో చెప్పుకుని గర్వపడతూంటాను. — ఆ మధ్య నీ సీరియల్ ఓ ప్రముఖ పత్రికలో చదివిన నా చెల్లెలు నీ ఘనతను గొప్పగా పొగిడేసింది..." అన్నాడు కృష్ణమూర్తి.

స్నేహితుడే నన్ను పొగడటం నాకు బొత్తిగా నచ్చ లేదు. అంచేత ఇబ్బందిగా నవ్వేను.

"అవునూ...... నేనీ వూళ్ళో వుంటున్నానని నీకెలా తెల్సూ?..." ఆశ్చర్యపోతూ అడిగేను.

"అసలు గమ్మత్తేమిటీ అంటే... మన ఫ్రండ్స్ ఎవ రెవరు ఎక్కడెక్కడున్నారు ... ఏం చేస్తున్నారు ఎలావున్నా రూని వివరాలు ఎప్పటి కప్పుడు సేకరించటం నా సరదా..." ఫక్కున నవ్వేడు కృష్ణమూర్తి.

"నీలో బాగా మార్పొచ్చింది. అప్పుడు బాగా బొద్దుగా పొట్టిగా వుండేవాడివి..." గతాన్ని పునశ్చరణ చేసుకుంటూ అన్నాను.

"నువ్వు మాత్రం?... అగ్గిపుల్ల లావుండేవాడివి! ... ఇప్పుడేమో పీపాలా లావెక్కిపోయావ్. గురూ . మందే మైనా రోజూ కొడుతున్నావా మన్లో మనమాట . ."

కృష్ణమూర్తి ప్రశ్నకు అవాక్కయ్యాను. శ్రీమతి గాని మా సంభాషణ వినటంలేదు గదాని ఇంట్లోకి చూశాను.

నిజానికి...... నేను అప్పుడప్పుడు స్నేహితుల మాట కాదన్లేక జేపోసిన పట్టేమాట యదార్థం. అయితే నేను మందు కొడుతాననే విషయం శ్రీమతికి తెలీనివ్వకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నాను.

రచయిత గాడివి... నువ్వింత పిరికి సన్నాసివా? అనే దృష్టితో కృష్ణమూర్తి నావేపు చూశాడు.

అందుకు సిగ్గుపడ్డాను.

"అది సరే... నువ్విప్పుడేంచేస్తున్నావ్?—"టాపిక్ మార్చాలని అడిగేను.

"నేను చెయ్యని వుద్యోగం లేదు...తిరగని వూరంటూ లేదు. — నా మనసుకు నచ్చిన జాబ్ ఇంత వరకూ దొరక లేదు. — అయినా... బ్రతకాలి గనుక ఓ పత్రికాఫీసులో సబ్ ఎడిటర్ వుద్యోగానికి ఈ మధ్యనే కుదిరేను.."

పత్రికాఫీసు ... సబ్ ఎడిటర్ వుద్యోగం అనే మాట వినగానే నా వూహాలు పరి పరి విధాలుగా పరుగెత్తాయి.

"అవునూ..... ఏ పత్రికాఫీసులో నువ్వు పని చేస్తోంది..." తెలుసుకుందామనే అడిగాను.

"పేరు 'జయీభవ'. త్వరలో రాబోతోంది. పార్ట్నర్సు మన ఫ్రెండ్సే! — బాగా బలిసినవాళ్ళు కావటంతో ... వాళ్ళ దగ్గరున్న 'బ్లాక్ మనీ' ఏం చేయటమాని ఆలోచించి చివరికి తెలుగు పాఠకులను వుద్ధరించేటందుకై పత్రికొకటి నడ పాలని నా సలహా కోరేరు. — నేనూ వుద్యోగావసరంలో వున్నానేమో... యస్సనేశాను! క్రితం నెల్లో ఓ లక్షరూపా యలు పత్రిక పేరున బేంక్ చేసి అన్ని పత్రికల్లో పబ్లిసిటీ

కూడా ఇచ్చేశారు. — నువ్వు ప్రకటన చూడలేదూ? ..."
గడగడా వివరాలన్నీ చెప్పేడు.

కృష్ణమూర్తి మాటతీరు నన్ను ఆశ్చర్యపరిచింది.

"కాఫీ తాగేక సిగరెట్ వెలిగించకపోతే ఏమిటో తిక్కగా వుంటుందోయ్—ఏదీ ఓ సిగరెట్ ఇలా పారెయ్..." అన్నాడేగానీ నేను అందించే లోగానే వాడే నా చేతిలోంచి లాగేసుకుని ఓటి వెలిగించాడు.

వాడి చొరవకి ఆశ్చర్యపోయాను.

"అదిసరే.. ఇంతకూ నా ఇల్లెట్లా కనుక్కో-గలిగేవు..." సాలోచనగా అడిగేను.

"ఒరేయ్! నీకో విషయం చెప్పనా!? — నోరు మంచిదైతే వూరు మంచిదౌతుంది — బస్సు దిగ్గానే నీ గురించి వాకబుచేశాను. ఓ పుణ్యాత్ముడు... నీ ఇంటికి ఎలా వెళ్ళాల్సిందీ... ఎన్ని సందులు తిరగాల్సిందీ బొమ్మగీసి చూపించేడు. రియల్లీ ఐ థాంక్ హిమ్!! — "

"ఓరినీ... మొత్తానికి అసాధ్యుడివే... అప్పటికీ ఇప్పటికీ నీ వాగుడులో మార్పేమీ లేదు... అవునూ! — నువ్వు పెళ్ళిచేసుకున్నావా? — "

"నేనింకా బ్రహ్మచారిగాడినేరా! ఎందుకని అడుగు? నా చెల్లి పెళ్ళిచేసి దాన్నో అయ్య చేతిలో పెట్టేసరికి నా తల ప్రాణం తోకకొచ్చింది — నాన్న పోవటంతో బాధ్యత

అంతా నా నెత్తిమీదపడ్డది. నేను స్వార్థపరుడ్ని కాదురో రేయ్. అందుకే నేను పెళ్ళి చేసుకోలేదు. చెల్లి పెళ్ళి మాత్రం చెయ్యగలిగేను.

"చూడు మూర్తీ! చెల్లెళ్ళ భవిష్యత్ కోసం జీవితాలను త్యాగంచేసే అన్నయ్యలు మనకు కేవలం సినీమాల్లోనూ... కథల్లోనూ కన్పిస్తారు. జీవితంలో నీ వంటి మంచి మనసున్న మనుష్యులు కన్పించటం చాలా అరుదు..."

నా మాటకి గర్వంగా నవ్వేడు మూర్తి.

అప్పటికి పన్నెండు గంటలు కావచ్చింది.

ఆకలి మనిషి న్నేను!

స్నేహితుడిని.... అందునా ఇంటికొచ్చిన వాడిని వదిలేసి వక్కడినే భోజనం చేసేటందుకు మనస్కరించలేదు నాకు. ఎటికసీకోసం చచ్చిపోయే సన్యాసిని నేను.

"అదిసరే... నీవెంట సంచీ అయినా తెచ్చుకోలేదేం...." అడిగేను అసలు వాడి ప్రోగ్రాం ఈ వూళ్ళో ఎన్నాళ్ళుంటుందో తెల్సుకోవాలనే వుద్దేశ్యంతో.

"పిటీ ఏమిటంటే వరే... నైటెక్స్‌ప్రెస్ బస్సులో వస్తుంటే మాంఛి నిద్రలోకి ఒరిగిపోయాను. నా సూట్‌కేసు పుచ్చుకుని ఎవడో ప్రయాణీకుడు ఎక్కడో దిగిపోయాడు. మెలుకవ వచ్చేసరికి నాకు ఏడుపొక్కటే మిగిలింది- వెధవది...

గుడ్డలు పోతేమానె వెంట తెచ్చుకున్న డబ్బంతా కూడా సూట్ కేసులోనే వుండిపోయింది. అదీ దౌర్భాగ్యం! — ” దిగులుగా చెప్పేడు.

జాలిగా కృష్ణమూర్తి ముఖంలోకి చూశాను.

“అసలు విషయమేమిటంటే... నాచెల్లి మొగుడు వట్టి తాగుబోతు. పెళ్ళయిన రోజునుంచీ దాన్ని రాచి రంపాన పెట్టటం ప్రారంభించేడు. చొక్కా పుచ్చుకుని ఓ రోజు వార్నింగిచ్చాను బావగాడికి - అంతే! రెండు రోజులక్రితం... ఇంట్లో డబ్బూ చెల్లి మెడలో నగలతోసహా వుడాయించాడు. అది లబోదిబోమంది. తీరా విచారిస్తే... బావగాడు ఈ వూళ్ళో వున్నట్టు తెల్సింది. అందుకే నేనొచ్చాను...”

కృష్ణమూర్తి మాటలు వింటుంటే సానుభూతి నన్ను ఆవరించింది. మరో సిగరెట్ వెలిగించాను.

“ నీ ఇంటికి రాబోయే ముందు అతగాడి బంధువుల ఇంటికెళ్ళొచ్చాను. నిన్ననే మద్రాసు బయలుదేరి వెళ్ళినట్టు చెప్పేరు. అదీ దురదృష్టం...”

“ అరె...రె... ”

“అయినా నన్ను తప్పించుకుని వాడెక్కడికిపోతాడులే! ఎక్కడున్నా గాలం వేసి పట్టుకోగలను. అది సరే.... రాత్రంతా ప్రయాణం... అలసటగా వుంది. అంచేత... ముందు స్నానం చేయాలి! తర్వాత భోజనం!

వెంటనే కూర్చున్న వాడినల్లా లేచి లుంగీ టవలు సోపు అందించి బాత్ రూమ్‌కి దోవచూపించేను.

స్నేహంకోసం ప్రాణమైనా సరే ఇచ్చేమనిషిన్నేను.

సృష్టిలో తియ్యనిది స్నేహమే అని నమ్మే వారిలో నేను ముఖ్యుణ్ణి.

అరగంటలో స్నానం కార్యక్రమం.. భోజనం చేయటం ముగిసింది.

మళ్ళీ పంచలో కూర్చున్నాం.

"నువ్వీమధ్య సినీమాక్కూడా కథలు వ్రాస్తున్నావని తెల్సింది..." కృష్ణమూర్తే మొదలు పెట్టేడు సంభాషణ.

"అడక్కురా బాబూ! అదంతా ఓ మాయా ప్రపంచం!! ఒక్కొక్క నిర్మాతా దర్శకుడూ నిముషానికి వెయ్యి కథలు చెప్పగల మొనగాళ్ళు! వాళ్ళు!!! — ఛాన్సు దొరికినందుకు మొదట్లో నేనూ సంబరపడ్డాను. తర్వాత విసుగు అన్పించింది."

"డోన్టువర్రీ! అదృష్టం కలిసివస్తే అవకాశాలు వాటంతట అవే కాళ్ళదగ్గర కొస్తయ్. సత్తావున్న మనిషివి నువ్వు!- బైదిబై... నువ్వు వ్రాస్తున్న నవల పూర్తికాగానే నాకు పంపించు. మా పత్రికలో సీరియల్‌గా వేసుకుంటాం..."

అలాగేలే అనే భావనలో తలూపేను.

నేను కుర్చీలో కూర్చుని వాగుతూనే వున్నాను. కృష్ణమూర్తి మాత్రం మధ్య మధ్య 'ఊఁ' కొడుతూనే నిద్రలోకి జారిపోయాడు.

*　　*　　*　　*

సాయంత్రం ఐదుగంటలు కావచ్చింది.

కృష్ణమూర్తి బయలుదేరే ప్రయత్నంలో వున్నాడు.

"అప్పుడే ప్రయాణమా..." అడిగేను.

"తప్పదు బ్రదర్! మద్రాసువెళ్ళి బావగాడిని పట్టుకుంటేనే గానీ విశ్రాంతి వుండదు. — బై దిబై... నాకో హెల్పు చెయ్యాలి నువ్వు... తప్పదు!!—"

ఏమిటన్నట్టు చూశాను.

"అడగాలంటే నాకే సిగ్గుగా వుంది. — నా పరిస్థితి చెప్పానుగా! — సూట్ కేసూ... డబ్బూ పోగొట్టుకున్నాను. ఇప్పుడు మద్రాసు వెళ్ళాలి. తప్పదు. అంచేత... ఓ వంద రూపాయలుంటే అప్పివ్వు. నేను వూరెళ్ళగానే నీకు పంపిస్తాను..."

కృష్ణమూర్తి మాటల్లో అర్థింపు వుట్టిపడ్డది.

నేను మధ్యతరగతి మనిషిని. అందునా నెలాఖరు!... అంత డబ్బు నా దగ్గర వుండట మనేది అసంభవం.

"ఏమిటాలోచిస్తున్నావ్..."

ఏం చేయటానికీ తోచలేదు. కృష్ణమూర్తి పరిస్థితికి

కేవలం జాలిపడి ప్రయోజనంలేదు. ఏదోవిధంగా స్నేహితుడి అవసరానికి ఆదుకుని సహాయ పడగలగాలి!

ఎట్లా అన్నదే నా ఆలోచన!?! —

కూర్చున్న వాడినల్లా లేచి హౌస్ ఓనర్ దగ్గరకెళ్ళి అప్పుగా యాభై రూపాయలు తీసుకున్నాను.

డబ్బు తెచ్చి కృష్ణమూర్తికి అందించేను.

స్నేహితుడి కళ్ళల్లో వెలిగిన తృప్తి చూచి మురిసి పోయాను.

"నీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను. — కానీ ... నిన్ను ఇబ్బంది పెట్టాల్సి వచ్చినందుకు మన్నించు..."

కృష్ణమూర్తి నావద్ద శలవు తీసుకుని గేటుదాటేడు. అతను సందు మలుపు తిరిగే వరకూ గేట్లోనే చూస్తూ నిల్చుండి పోయాను.

*   *   *   *

కృష్ణమూర్తి నా దగ్గరకు వచ్చి వెళ్ళేక రెండు మూడు ఫస్టు తారీకులు దొర్లిపోయాయి.

అనుకోకుండా నేనొకసారి ఆఫీసుపనిమీద విజయవాడ వెళ్ళాల్సి వచ్చింది.

ఎలాగూ వెళ్ళానుగదాని... కృష్ణమూర్తి ఇచ్చి వెళ్ళిన ఇంటి అడ్రసు వెతుక్కుంటూ సత్యన్నారాయణ పురం చేరుకున్నాను.

ఎంతసేపు తిరిగినా ఇల్లు కనుక్కోలేకపోయాను. ఇక విసుగు అన్పించిందినాకు.

ఇకలాభం లేదనుకుంటూ సిటీబస్సు కోసం సెంటర్లో కొచ్చి నిలబడ్డాను.

ఇంతలో నాకు తెల్సిన మిత్రుడు రాఘవరావు హఠాత్తుగా ప్రత్యక్షమైనాడు— వాడిని చూడగానే సంబరపడ్డాను. రాఘవరావుని కల్సికూడా చాలాకాలమైంది.

కాస్సేపు ఒకరి నొకరు పరామర్శించుకున్న తర్వాత కృష్ణమూర్తి విషయం ప్రస్తావనకొచ్చింది.

జరిగింది రాఘవరావుకి చెప్పేను.

"ఓరి వీడిదుంపతెగ! — నీకూ మస్కా వేశాడూ?..
అంటూ పెద్దపెట్టున నవ్వేడు రాఘవరావు.

"అదేమిట్రా అట్లా అంటావ్?..." ఆశ్చర్యపోతూ అన్నాను.

"మన ఫ్రెండ్సులో పాడైపోయిన రాస్కెల్ వాడొక్కడే! బాగా చెడిపోయాడు. వాడిసంగతి తెలిసి వాడిఎదుట పడేటందుకే జంకాల్సివస్తోంది — మనిషికోకట్టుకథ చెప్తాడు. ఆపూటకి వాడి అవసరం గడుపుకుంటాడు. ఇదీ వాడితంతు!!— అబద్ధాల బ్రతుకైపోయింది వాడిది...."

ఆ మాట విన్న నాకు తల తిరిగినట్లయింది.

"కొత్తల్లో... నీలాగే అందరం పిటీ చూపించాం! — కానీ... అది వాడి వృత్తి అనే విషయం తెల్సుకున్న తర్వాత హేట్ చెయ్యక తప్పలేదు. అలాంటి వెధవ ఫ్రెండు అనేసి చెప్పుకుందుకే సిగ్గుగావుంది...."

"అయితే... వాడి చదువు... తెలివి తేటలూ... చివరికి ఇందుకు వుపయోగపడుతున్నాయన్న మాట .."

కృష్ణమూర్తి నాదగ్గర యాభై రూపాయలు పట్టుకెళ్ళినందుకు బాధన్పించలేదు.

కానీ ... ఒక స్నేహితుడితో నిజం చెప్పగల ధైర్యం వాడిలో లేకపోయినందుకు విచారించేను.

వాడు బాంకి నన్ను ఛీట్ చేశాడు. అందుకు నామనస్సు వికలమై పోయింది.

సిటీ బస్సు విమానంలా వచ్చి స్టాప్‌లో ఆగింది.

రాఘవరావు దగ్గర శలవు తీసుకుని బరువైన మనసుతో బస్సెక్కేను.

[25-11-79 ఆకాశవాణి కడపకేంద్రం నుండి ప్రసారితమైంది ]

**OPENING SHORTLY**
**FOR**
**FRESH DELICIOUS GOOD TASTE**

## VISIT

# Hotel Sridevi Bala

**( Vegeterian only )**

*Prop* :- **T. TIRUVENGADAM**

R. T. C. Bus
Depot Road
**CHITTOOR**

**DEVI HOTEL**
Church Street
**CHITTOOR**

## visit once

# PRAKASH STORES

HIGH ROAD **CHITTOOR.** (A. P.)

*Dealers in Aristocrat Suit Cases Fancy goods*

*Presentation articles, Toys and Crockery.*

Made out of the Finest Materials

# MANGALORE GANESH BEEDIES

Smokers Cannot afford to miss them

## Daily Sales Exceed 8 Crore Beedies

★

*Head Office:*

## Mangalore Ganesh Beedi Works

**VINOBA ROAD : MYSORE - 570005**

*Telephone:* **20241**

*Telegrams:* **'AROMA.'**

# Ramakrishna Engineering Works

***Specialists in Rig Repairings***

***And Parts***

ALSO

***Approved by the Govt. of A. P.***

***VISIT***

**For All Types of Engineering Works**

Phone : **2874**

18-5-63
Palmaner Road,
**CHITTOOR**-517 001

---

**FOR QUALITY & RELIABILITY**

# UNITED TYRES

*AVAILABLE*

**ALL KINDS OF NEW TYRES**

ALSO

**BEST RETRADERS**

*Prop :-* **P. V. MATHEW**

Phone : **2688**

17—2—59
Ponniamman Koil Street,
**CHITTOOR (A. P.)**